క్లుప్తంగా

19న ప్రజా వేదిక

బిక్కవోలు: మండలంలోని జాతీయ ఉపాధి హామీ 18వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం తెలిపారు.

బాధ్యతల స్వీకరణ


సత్యప్రసాద్, ఏవో

పెదపూడి: మండల వ్యవసాయశాఖ అధికారిగా ఎస్.సత్యప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీపై ఆయన రామచంద్రపురం నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఏవోగా పనిచేసిన టీవీఆర్ మణిదీప్ రామచంద్రపురానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

రాజానగరానికి..


కల్యాణ్ సూర్యకుమార్

రాజానగరం: మండల వ్యవసాయాధికారిగా అన్నమరాజు కల్యాణ్ సూర్యకుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ పనిచేసిన షేక్ ఇమామి ఖాసిమ్ ఏలూరు జిల్లా పెదపాడు మండలానికి బదిలీ అయ్యారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగాసనాలు వేస్తున్న విద్యుత్ సిబ్బంది

రంగంపేట: శారీరక, మానసిక ఆరోగ్యానికి నిరంతరం యోగా చేయాలని విద్యుత్ ఏఈ తోట శిరీష అన్నారు. జి.దొంతమూరులోని ఇస్కాన్‌లో సోమవారం రవీంద్ర చైతన్య దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగత, కుటుంబ, సామాజిక ఆరోగ్యానికి ప్రతి రోజూ కొంత సమయాన్ని యోగాభ్యాసం చేయడానికి కేటాయించాలన్నారు. ఒత్తిడి లేని జీవితానికి ధ్యానం, యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

తొర్రిగెడ్డ పథకం సందర్శన

రాజానగరం: ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటలకు ఎత్తిపోతల పథకాల ద్వారా ముందుగానే గోదావరి జలాలను అందిస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. సీతానగరం మండలంలోని తొర్రిగెడ్డ ఎత్తిపోతల పథకాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకానికి చేయాల్సిన మరమ్మతులను వేగిరమే పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

నిర్ణీత గడువులో అర్జీల పరిష్కారం


అర్జీ స్వీకరిస్తున్న అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 16 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎస్ఈ (ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, ఎంహెచ్ఓ వినూత్న పాల్గొన్నారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 23 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ సుబ్బరాజు

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టం (పీజీఆర్ఎస్)కు 23 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ఏఎస్పీలు ఎంబీఎస్ మురళీకృష్ణ, ఏవీ సుబ్బరాజు స్వయంగా మాట్లాడారు. వారి అర్జీలను స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదిదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు.

మట్టి పరీక్ష.. నేలకు రక్ష

- భూసార పరీక్షలతో ప్రయోజనాలు
- ఫలితాలను అనుసరించి పంట సాగుచేస్తే అధిక దిగుబడి
- ఖర్చు తక్కువ, రాబడి ఎక్కువ


రంగంపేటలో భూసార పరీక్షలకు మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రంగంపేట: ఆరోగ్యకరమైన పంటలు పండాలంటే నేలలో ఖనిజ లవణాలు, పోషకాలు ఉండాలి. అయితే ప్రస్తుతం అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో రసాయన ఎరువులు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో భూమి సమతుల్యత కోల్పోతోంది. మొక్కకు సరైన పోషకాలు అందక పంట దిగుబడిపై ప్రభావం పడుతోంది. ఈ సమస్య పరిష్కారానికి మట్టి పరీక్షలు చేయించాలి. ఫలితాలకు అనుగుణంగా పంటను సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చు. దీని వల్ల ఖర్చు తక్కువ కావడంతో పాటు దిగుబడి పెరిగి, రైతులకు రాబడి అధికంగా ఉంటుంది.

భూసార పరీక్షలు కీలకం

భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం పరిమాణాల్లో మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. సూక్ష్మ పోషకాల లోపాలను తెలుసుకోవడమే కాకుండా భూమిలో ఏ పోషకాలు తగ్గాయనే విషయాన్ని తెలుసుకోవచ్చు. సేంద్రియ కర్బనం తగ్గితే పచ్చిరొట్ట పంటలను సాగుచేసి నష్టాలు నివారించవచ్చు. నేల పోషక సామర్థ్యాన్ని తెలుసుకోవడం ద్వారా ఏ పంట వేస్తే మంచి దిగుబడి వస్తుందో రైతులు గ్రహించే అవకాశం ఉంటుంది.

మోతాదు మించితే..

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయన ఎరువుల వల్ల భూమిలో పోషకాలు నశించిపోతున్నాయి. పోటాషియం ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి పోషకాలు మొక్కలకు అందకుండా పోతాయి. జింకు లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతుంది. సూక్ష్మ పోషకాలతో పాటు నైట్రోజన్, సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది.

ప్రయోగశాలల్లో..

భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 వరకు ఉంటే సాధారణంగా పరిగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలిసింది. మట్టిని ప్రయోగశాల్లో విశ్లేషించి ఆ నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువ స్థాయిలను గుర్తిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించడం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

ప్రయోజనాలు ఇవే..

మట్టి పరీక్షల్లో ఆమ్ల, క్షార లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాషియం ఎంత నిష్పత్తిలో ఉన్నాయో తెలుసుకుని, పంట వయసు కాలాన్ని అనుసరించి ఎరువులను సమపాళ్లలో అందించవచ్చు. ఆమ్లగుణం ఉన్న నేలను సున్నం, క్షార గుణం ఉన్న నేలలను జిప్సంతో బాగు చేసుకోవచ్చు. నేలలో సహజంగా ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకుని సాగు చేసే పంటలకు ఎరువుల మోతాదును నిర్ణయించుకోవచ్చు. నేల పోషక సామర్థ్యాన్ని తెలుసుకుని ఏ నేలలో ఏ పంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకునే వెసులుబాటు ఉంటుంది. పంటకు నేలలో తగు నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్ష ద్వారా తగ్గిన పోషకాలను అందించి దిగుబడులు పెంచుకునే అవకాశం ఉంది. పెట్టుబడి తగ్గి దిగుబడి పెరగాలంటే రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి.

ఇదే సరైన సమయం



రైతులందరూ తమ పొలాల్లో మట్టి నమూనాల సేకరణ చేయించుకోవాలి. వాటికి మట్టి పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమిలోని పోషక లోపాలను తెలుసుకోవచ్చు. వాటిని నివారించడం ద్వారా సాగులో మంచి ఫలితాలు పొందే అవకాశం ఉంటుంది. చాలామంది రైతులు సాగు సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోవడంతో దిగుబడులు కోల్పోతున్నారు. ఏటా ఒకే రకమైన పంటలు వేయడం, ఎవరికి తోచినట్టు వారు సాగు చేయడం, ఇష్టానుసారంగా మందులు, ఎరువులు వినియోగించడం తదితర కారణాలతో వ్యవసాయంలో అనుకున్నంత ఆదాయాన్ని పొందలేక పోతున్నారు. మట్టి పరీక్షలకు ఇదే సరైన సమయం.

– కె.మాధవరావు, జిల్లా వ్యవసాయ అధికారి

రైతులకు ఎంతో మేలు



సుమారు నెల రోజుల నుంచి పొలాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్నాం. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే రైతులకు అధిక దిగుబడులు వస్తాయి. ఈ ఏడాది కూడా భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాం. మండలానికి 1,285 మట్టి నమూనాలు లక్ష్యంగా ఇవ్వగా ఇప్పటి వరకు 1,116 నమూనాలు సేకరించి, వాటిని ప్రయోగశాలకు పంపించాం. వాటి ఫలితాలు వచ్చిన వెంటనే రైతులకు అందిస్తాం.

– కె.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి, రంగంపేట

ప్లాస్టిక్ వస్తువులతో అనేక అనర్థాలు


కాటవరంలో ర్యాలీ చేస్తున్న పర్యావరణ ప్రేమికులు

కోరుకొండ (సీతానగరం): ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ సీతానగరం మండలం కాటవరంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికులు, స్థానికులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వ్యతిరేకోద్యమం నాయకురాలు గారపాటి వనజ మాట్లాడుతూ ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే గ్రామ దేవత పాశాలమ్మ జాతర సందర్భంగా గ్రామానికి అధిక సంఖ్యలో బంధువులు, స్నేహితులు వస్తారన్నారు. ఆ సమయంలో ప్లాస్టిక్ వస్తువులు ఉపయోగిస్తే పర్యావరణానికి హాని జరుగుతుందన్నారు. కాబట్టి ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని విజ్ఞప్తి చేశారు. వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహించినట్టు పేర్కొన్నారు. కాగా, పాశాలమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా సాగింది. కళాకారులు ప్రదర్శనల ద్వారా స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిట్టూరి రమేష్, జాస్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నన్ను క్షమించు.. జున్ను జాగ్రత్త

భార్యకు మెసేజ్ పెట్టి వ్యక్తి అదృశ్యం


సలాది రాంబాబు

రాజానగరం: 'నన్ను క్షమించు.. నిన్ను వదిలి వెళుతున్నాడు.. జున్ను (కొడుకు) జాగ్రత్త అంటూ ఓ వ్యక్తి తన భార్యకు మెసేజ్ పెట్టి అదృశ్యమయ్యాడు. వివరాల్లోకి వెళితే.. కడియపులంకలోని ముసలమ్మ గుడి వీధిలో నివాసం ఉంటున్న సలాది రాంబాబు (28), భార్య స్వాతితో కలిసి రాజానగరంలోని కొత్త కాలనీలో ఉంటున్న ఎస్.లక్ష్మీప్రసన్న ఇంటికి శనివారం రాత్రి వచ్చారు. భోజనాలు చేసి, రాత్రికి అక్కడే నిద్రించారు. తెల్లవారిన తర్వాత లేచి చూసేసరికి రాంబాబు కనిపించలేదు. దీంతో స్వాతి, బంధువులు పరిసరాల్లో గాలించినా, బంధువులకు ఫోన్ చేసి వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అదృశ్యమైన తర్వాత రాంబాబు ఫోన్ నుంచి స్వాతికి 'నన్ను క్షమించు, నిన్ను వదలివెళ్తున్నాను, జున్ను (కొడుకు) జాగ్రత్త' అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో అందరూ రాంబాబుకు ఏం జరిగిందోనని కంగారు పడుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని రాజానగరం ఎస్సై ఏకే సత్యనారాయణ తెలిపారు. రాంబాబుకు అప్పుల బాధలు గానీ, కుటుంబ సమస్యలుగానీ ఏమీ లేవని చెబుతున్నారు. మరి ఎందుకు అదృశ్యమయ్యాడో ఎవ్వరికీ తెలియడం లేదు. అతడి ఆచూకీ తెలిసిన వారు 98483 79998కు ఫోన్ చేసి, సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

పైపులైన్ లీకేజీని అరికట్టండి

సాక్షి ఇంపాక్ట్

కోరుకొండ: చెరువు కాదు.. నీరు లీకు అంటూ సాక్షి పత్రికలో ఈ నెల 10వ తేదీన వచ్చిన కథనానికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్పందించారు. పశ్చిమగానుగూడెంలోని కోనేరు వద్ద గల కాలువ కింద భాగంలో ఏర్పాటు చేసిన సత్యసాయి మంచినీటి పథకం పైప్‌లైన్‌ను ఆయన ఆదివారం పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. కాగా.. ఈ పైప్‌లైన్ ద్వారా ఏడు గ్రామాలకు నీటి సరఫరా జరుగుతోంది. పైప్‌లైన్ పగిలిపోవడంతో 15 రోజులుగా ప్రజలకు తాగునీరు అందడం లేదు.


పగిలిన పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

అన్ని వర్గాల సంక్షేమమే ప్రధాని మోదీ ధ్యేయం

రాజమహేంద్రవరం సిటీ: అన్ని వర్గాలకు సంక్షేమాన్ని అందించడమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్యేయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనపై జేఎన్ రోడ్డులోని చెరుకూరి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్రధాని మోదీ 11 ఏళ్ల సుపరిపాలన, ప్రజా సంక్షేమంపై వృత్తి నిపుణుల (ప్రొఫెషనల్స్)తో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో మన జవాన్ల శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు. అనంతరం వికసిత్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానం

సీటీఆర్ఐ: నందమూరి తారక రామారావు పేరున పురస్కారం అందుకోవడం తన అదృష్టమని ఎన్టీఆర్ పురస్కార గ్రహీత డాక్టర్ ఎంబీ నాగేశ్వరరావు అన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో సోమవారం ఎంపీ నివాసంలో విభిన్న రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన డాక్టర్ ఎంబీ నాగేశ్వరరావు (తాడేపల్లిగూడెం), రిమ్మలపూడి సత్యనారాయణ మూర్తి (మత్రిపూడి))లకు ఎన్టీఆర్ కీర్తి పురస్కారాలను అందించి ఘనంగా సత్కరించారు. ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఫిలాంత్రోఫిక్ సొసైటీ, పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి.

టీబీ, హెచ్ఐవీపై అవగాహన అవసరం


దోమాడలో ర్యాలీ చేస్తున్న డాక్టర్ సురేష్ కుమార్ తదితరులు

పెదపూడి: టీబీ, హెచ్ఐవీ వ్యాధులపై అందరికీ అవగాహన అవసరమని పెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సురేష్ కుమార్ అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం దోమాడ గ్రామంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమట పట్టడం, దగ్గినప్పుడు కళ్లెలో రక్తం పడటం, ఛాతీలో నొప్పి, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, అలసట మొదలైనవి టీబీ వ్యాధి లక్షణాలన్నారు. అలాగే హెచ్ఐవీ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్దాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డి.ప్రత్యూష, సర్పంచ్ మీనవల్లి శారదాదేవి, మద్దిపూడి గంగరాజు, హెచ్ఐవీ కోఆర్డినేటర్ బుజ్జిబాబు, జి.వెంకటేష్, సూపర్‌వైజర్ హనుమంతరావు, పీహెచ్ఎస్ డి.అమ్మాజి, డి.మురళీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయిని రమ్యసుధకు అవార్డు


రమ్యసుధను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: అంతర్జాతీయ స్థాయి సెమినార్‌లో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయిని రమ్యసుధ ప్రతిభ కనబరిచి అవార్డు సాధించారు. దీనిపై సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి మాట్లాడుతూ ఈనెల 12, 13వ తేదీల్లో నేపాల్‌లోని ఖాట్మాండులో ఎంఐటీ ఖాట్మాండు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ సెమినార్‌లో తమ పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు రమ్యసుధ పాల్గొన్నారన్నారు. అక్కడ జరిగిన ఇన్నోవేటివ్ ప్రాక్టీసస్ ఫర్ అక్సిలరేటెడ్ గ్రోత్ ఇన్ కామర్స్ హ్యూమానిటీస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో రమ్యసుధ సమర్పించిన పరిశోధన పత్రానికి అవార్డు, ప్రశంసా పత్రం లభించాయన్నారు. కాగా.. రమ్యసుధను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథితో పాటు ఎంఈఓలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆరుతడి పద్ధతులతో మెరుగైన దిగుబడి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వరి సాగులో నీటి పొదుపు, పర్యావరణ పరిరక్షణ, మెరుగైన దిగుబడుల కోసం ఆరుతడి పద్ధతులు చాలా అవసరమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. ఇన్నీసుపేటలోని అరుణ ప్యాలెస్‌లో వరిలో ఆరుతడి పద్ధతిపై మూడు రోజులు జరిగిన శిక్షణ సోమవారంతో ముగిసింది. జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా అంతర రాష్ట్రీయ వరి పరిశోధన కోర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లకు ఈ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు మాట్లాడుతూ ఆరుతడి పద్ధతి ద్వారా తెగుళ్లు, పురుగులు ప్రభావం తగ్గుతుందని, సంప్రదాయ పద్ధతులతో సమానమైన, అంతకంటే మెరుగైన దిగుబడులు పొందవచ్చన్నారు. కోర్ ప్రాజెక్ట్ నిపుణులు మాట్లాడుతూ ఆరుతడి పద్ధతి విధానాలను వివరించారు. ఈ పద్ధతిలో 30 శాతం వరకూ సాగునీరు ఆదా అవుతుందని, పంట మంచిగా ఎదుగుతుందని, 50 శాతం వరకు మీథేన్ వాయువు విడుదలను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం మహబూబ్ వలీ, వారణాసి సౌత్ ఆసియా రీజినల్ సెంటర్ అసోసియేట్ శాస్త్రవేత్తలు అంకిత పాల్, పవన్, అంతర్జాతీయ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు అఖిల్, ప్రిన్స్, దివ్య, సతీష్ పాల్గొన్నారు.

జీవనభృతికి ఐదు ఎకరాలు కేటాయించండి

కలెక్టర్‌ను కోరిన మాజీ సైనికుడు


న్యూరోడిసీజ్‌తో బాధపడుతున్న మాజీ సైనికుడు రామసుబ్బారెడ్డి


కలెక్టర్ ప్రశాంతికి సమస్యను వివరిస్తున్న కుటుంబ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: జీవనభృతికి బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో ఐదు ఎకరాలు భూమి కేటాయింపు జరపాలని న్యూరోడిసీజ్‌తో బాధపడుతున్న మాజీ సైనికుడు ద్వారంపూడి రామసుబ్బారెడ్డి, కుటుంబసభ్యులు సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతిని కోరారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి భార్య, కుమారుడు మాట్లాడుతూ కొవిడ్ వ్యాక్సిన్ తీసుకున్న తరువాత న్యూరో డిసీజ్‌తో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారన్నారు. గతంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌కు జీవనభృతికి భూమి కోసం అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. అప్పుడు జిల్లా పరిషత్‌కు చెందిన బిక్కవోలు మండలం కాపవరానికి చెందిన ఐదు ఎకరాలు భూమిని మాజీ సైనికుల కుటుంబాలకు మంజూరు చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాల విభజన నేపథ్యంలో ప్రస్తుత తూర్పు గోదావరి జిల్లా పరిధిలోకి బిక్కవోలు మండలం కాపవరం గ్రామం రావడం జరిగిందన్నారు. కావున తమకు ఐదు ఎకరాల భూమిని మంజూరు చేయాలని అర్జీని అందజేశారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ ప్రశాంతి.. పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదిక అందించాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు.

చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు

- ఏడాది పాలనలో అన్నీ మోసాలు, అరాచకాలే
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ శ్రేణులు

రాజమహేంద్రవరం రూరల్: 'ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ఏదీ' అని ప్రశ్నిస్తే నాలుక మడతపెడతానన్న సీఎం చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. చంద్రబాబు ఏడాది పాలనలో మోసాలు, అరాచకాలే కనిపిస్తున్నాయన్నారు. సోమవారం రూరల్ నియోజకవర్గస్థాయిలో వేణు ఆధ్వర్యంలో 'జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం' అంటూ చంద్రబాబు ఏడాది పాలనలో అరాచకాలు, మోసాలను వివరిస్తూ ప్రచురించిన బుక్‌లెట్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకు సీఎం చంద్రబాబుకు నిద్రలేకుండా చేస్తామన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం కంటే రెండింతలు ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత చంద్రబాబు తల్లికి వందనం పేరుతో వంచన చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లులు ఉంటే 54 లక్షల మందికి మాత్రమే ఈ పథకం ఇచ్చారన్నారు. తల్లికి వందనం ఇచ్చే సమయంలో చంద్రబాబు మాట్లాడుతూ ఇక అన్ని సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చామని, ఎవరైనా ప్రశ్నిస్తే వారి నాలుక మడత పెడతామని ప్రజలను బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి ఆరే చిన్ని, వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు చీకురుమిల్లి చిన్న, అంగాడ సత్య ప్రియ, కొత్తపల్లి శివాజీ, మాజీ సొసైటీ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను, మండల వ్యవసాయ సలహా కమిటీ మాజీ చైర్మన్ ఈలి గోపాలం, పార్టీ నాయకులు ముత్యం జగదీశ్, గాడ సాయిరాం, విప్పర్తి ఫణి, మార్గాని బాలరామ్, బోడపాటి సత్తిబాబు, చిలుకూరి రామకృష్ణ, సర్కార్ బాషా, రంభాల దుర్గారావు, దాసరి శ్రీను పాల్గొన్నారు.

ఆ ఎమ్మెల్యేలకు క్యాబినెట్ హోదా ఇవ్వాలి

సీటీఆర్ఐ: పుష్కరాల నిర్వహణ కోసం స్థానిక ఎమ్మెల్యేలకు క్యాబినెట్ హోదా ఇవ్వాలని రాష్ట్ర బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సానబోయిన రామారావు అధ్యక్షతన సోమవారం సంఘ కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రామారావు మాట్లాడుతూ రానున్న గోదావరి పుష్కరాలు సజావుగా సాగేందుకు, 2015 పుష్కరాల నాటి దురదృష్టకర సంఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు రాజమండ్రి సిటీ, రూరల్ ఎమ్మెల్యేలకు కేబినెట్ హోదా కలిగిన బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ తమకు రాజకీయాలతో సంబంధం లేదని, ఏ ప్రభుత్వం మంచి చేసినా అభినందిస్తామని చెప్పారు.

ఇంటర్‌లో ప్రవేశానికి విద్యార్థులకు కౌన్సెలింగ్


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పాఠశాలల్లో చదువుకుని, 2024 – 25 విద్యా సంవత్సరంలో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియర్ కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ తెలిపారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థకు చెందిన 13 ఉన్నత పాఠశాలల్లో 176 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించారన్నారు. వీరందరూ కూడా తమకి నచ్చిన ఇంటర్మీడియట్ కాలేజీలలో అతి తక్కువ ఫీజుతో ప్రవేశానికి విద్యోన్నతి కార్యక్రమం ద్వారా నగరపాలక సంస్థ అవకాశం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి (అర్బన్) దిలీప్ కుమార్, నరసింహారావు, ఆర్ఎంసీ మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, రెవెన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం పాల్గొన్నారు.